క్లుప్తంగా

విజృంభిస్తున్న జ్వరాలు

పాల్వంచరూరల్: మండలంలోని కోడిపుంజుల వాగు గ్రామస్తులు పలువురు జ్వరాలతో విలవిల్లాడుతున్నారు. గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన అజ్మీరా జగదీష్, రాందాస్, విజయతోపాటు ఇద్దరు చిన్నారులకు టైఫాయిడ్ సోకింది. అలాగే, ఇంకొందరు కూడా విషజ్వరాలతో మంచం పట్టారు. గ్రామంలో దోమల బెడద కారణంగా జ్వరాలు విజృంభిస్తున్నందున అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి

పాల్వంచ: అడ్డగోలుగా ప్రజలను దోచుకుంటున్న మెడికల్ మాఫియాపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర నాయకులు కనగాల అనంతరాములు డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రులతో వాటాలు మాట్లాడుకోవడం, సామాన్యుల నుంచి మందులను విపరీతమైన ధరలకు అంటగట్టి మోసాలకు పాల్పడుతున్నా డ్రగ్ కంట్రోల్ అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్నారు. తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్నారు.

తునికాకు బోనస్ చెల్లించాలి

ఇల్లెందు: ప్రభుత్వం 2016 నుంచి 2022 వరకు తునికాకు కార్మికులకు చెల్లించాల్సిన బోనస్‌ను తక్షణమే కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని శనివారం సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ చంద్రన్న వర్గం రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేరుతో విడుదలైన ప్రకటనలో డిమాండ్ చేశారు. అటవీ అధికారులు, పైరవీకారులు కుమ్మక్కై కార్మికులకు తీరని అన్యాయం తలపెట్టారని తెలిపారు. ప్రమాదాల నడుమ ఆకు సేకరించిన కార్మికులకు బోనస్ ఏళ్లు గడుస్తున్నా అందకపోవటం దుర్మార్గమని పేర్కొన్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ


దాతలు అందజేసిన కుర్చీలు

జూలూరుపాడు: మండలంలోని కాకర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు శనివారం దాతలు కుర్చీలను వితరణ చేశారు. కాకర్లకు చెందిన వాసినేని పిచ్చయ్య, వెంకటేశ్వర్లు జ్ఞాపకార్థంగా వారి కుటుంబసభ్యులు శ్రీనివాసరావు, నాగరాజులు రూ.12,000లు విలుగల విజిటర్స్ చైర్స్‌ను అందజేశారు. హెచ్‌ఎం పి.సంజీవరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ కృష్ణారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఖాజామియా, మిర్యాల రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి సమ్మెలోకి ఆశ కార్యకర్తలు

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్ల సాధన లక్ష్యంగా సోమవారం నుంచి నిరవధిక సమ్మె చేపడుతున్నట్టు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నబి తెలిపారు. ఈ మేరకు శనివారం రొంపేడు పీహెచ్‌సీలో ఆశ కార్యకర్తలు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నబి మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో ప్రజారోగ్యం పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తున్న ఆశ కార్యకర్తలకు కనీస వేతనం రూ.18వేలు చెల్లించాలని కోరారు. ఆశ వర్కర్లు మల్లేశ్వరీ, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధి 5వ వార్డులో ప్రభుత్వ స్థలాన్ని కొందరు ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝర్రా కామేష్ ఆరోపించారు. ఈ సందర్భంగా వార్డులోని గంగహుస్సేన్‌బస్తీలో ఆయన శనివారం పర్యటించారు. ప్రభుత్వ స్థలంగా చెబుతూ రైతువేదికను నిర్మించగా, అక్కడ విలువైన స్థలం తనదేనని ఓ జాతీయ పార్టీ నాయకుడు, ఆయన కుటుంబీకులు కాజేసేందుకు జీఓ 76 ద్వారా దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. 2019లోనూ ఇలాగే చేయగా అప్పటి కలెక్టర్ నిర్మాణాలు కూల్చివేయించారన్నారు. మళ్లీ మున్సిపల్, రెవెన్యూ అధికారుల సహకారంతో స్థలం ఆక్రమణకు యత్నిస్తున్నందున అధికారులు స్పందించాలని డిమాండ్ చేశారు. నాయకులు గంధం మల్లికార్జున్‌రావు, గుడివాడ రాజేందర్, నాగుల రవికుమార్, అల్లకొండ శరత్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

లే ఔట్ స్థలం ఆక్రమణ

కొత్తగూడెంఅర్బన్: సోమవారం కొత్తగూడెం పట్టణ పరిధి పాతకొత్తగూడెంలోని 28 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేసేందుకు ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సిద్ధమయ్యారు. ఈ లోగా ఆక్రమణదారులు అక్కడి స్థలం మూడెకరాల వరకు కబ్జా చేసేందుకు ఏకంగా ప్రహరీ నిర్మించారు. స్థానికుల ఫిర్యాదుతో తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ప్రహరీని తొలగించారు. ప్రభుత్వ స్థలంను ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని రెవెన్యూ అధికారులు హెచ్చరించారు.

సంతలో చింతలెన్నో..

- అవస్థలు పడుతున్న వ్యాపారులు
- హోల్‌సెల్ మార్కెట్‌కు దొంగల భయం
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు..


కోలాహలంగా ఉన్న వారసంత (ఫైల్)


సంత ఆవరణలో అపరిశుభ్ర వాతావరణం


సంచులు కప్పి దాచిపెట్టిన వస్తువులు, కూరగాయలు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలో ప్రతీ ఆదివారం నిర్వహించే వారసంతలో సౌకర్యాలేమితో చిరు వ్యాపారులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీకి పన్ను చెల్లిస్తున్నప్పటికీ సౌకర్యాలను అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నేలపైనే వ్యాపారం చేయడం ఇబ్బందవుతుందని వ్యాపారులు వాపోతున్నారు. సంతలో షెడ్‌లు లేకపోవడంతో ప్రస్తుతం పడుతున్న వర్షాలకు కూరగాయలు తడిచిపోయి, పాడవుతున్నాయంటున్నారు. పన్ను మాత్రం క్రమం తప్పకుండా వసూలు చేస్తున్నారని, ఏళ్ల తరబడిగా మున్సిపల్ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా కూడా పట్టించుకోవడం లేదంటున్నారు. సంతలో ఉన్న వాటర్‌ట్యాంక్ పని చేయకపోవడంతో వ్యాపారులు, ప్రజలు నీటిని కొనుగోలు చేసి దాహం తీర్చుకునే పరిస్థితి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు సంత ఆవరణలో వర్షాపు నీరు నిలిచిపోయి, అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. దీంతో పాటుగా సంతలో సాయంత్ర వేళ మిగిలిపోయిన కూరగాయలు, పాడైనవి ఆవరణలోనే పడి వేయడంతో అపరిశుభ్ర వాతావరణంతో పాటుగా దుర్వాసన వెదజల్లుతోంది. ఇప్పటికైనా అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు.

మార్కెట్‌కు భద్రత కరువు..

సంత ఆవరణలో నిర్వహిస్తున్న హోల్‌సెల్ మార్కెట్‌కు భద్రత కరువవడంతో దొంగలు పడుతున్నారు. ఇటీవల గుర్తు తెలియని దొంగలు రాత్రి వేళలో హోల్‌సెల్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి దోసకాయ, టమాట బస్తాలను దొంగలించారు. అయితే గుంటూరు, మదనపల్లి, ఖమ్మం, ఆంధ్రా నుంచి కూరగాయాలు సంత ఆవరణలోని హోల్‌సెల్ మార్కెట్‌కు వస్తుంటాయి. హోల్‌సెల్ మార్కెట్‌కు వచ్చిన కూరగాయాల లోడ్‌ను కాంప్లెక్స్‌లో భద్రపరిచి, మార్కెట్ వ్యాపారులకు అమ్ముతుంటారు. మార్కెట్ చుట్టు ప్రహరీ లేకపోవడంతో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయని, నిర్వాహకులు చెబుతున్నారు. ప్రధానంగా మార్కెట్, సంత ఆవరణలో వీధిలైట్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో దొంగలకు మంచి అవకాశం లభించినట్లైంది. రాత్రి వేళల్లో ఎక్కువగా కూరగాయల బస్తాలను దొంగలిస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. సంత, హోల్‌సెల్ మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ వ్యాపారులంతా కూడా ఇటీవల స్థానిక ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం సైతం అందజేశారు.

అవస్థలు పడుతున్నాం

సంత, హోల్‌సెల్ మార్కెట్‌లో సౌకర్యాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షానికి తడుస్తూ, ఎండకు ఎండుతున్నాం. ట్యాక్స్ వసూళ్లు చేస్తున్నప్పటికీ మున్సిపాలిటీ వారు సౌకర్యాలపై దృష్టి సారించడం లేదు. ఎన్ని సార్లు అధికారులను, ప్రజాప్రతినిధులను కలిసిన కూడా ప్రయోజనం ఉండడం లేదు.

– బషీర్, హోల్‌సెల్ మార్కెట్ వ్యాపారి

సౌకర్యాలకు చర్యలు చేపడతాం

సంతలో వ్యాపారులకు సౌకర్యాలకు చర్యలు తీసుకుంటాం. హోల్‌సెల్ మార్కెట్‌లో కూడా విద్యుత్ సౌకర్యం ఏర్పాటును త్వరతగతిన జరిగే విధంగా చూస్తాం. సంతలో షెడ్‌లు, ప్లాట్‌ఫాం విషయంపై కౌన్సిల్ సభ్యులతో చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

– రఘు, మున్సిపల్ కమిషనర్, కొత్తగూడెం

రేపు ఇళ్ల స్థలాల పంపిణీ


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంఅర్బన్: రేపు(సోమవారం) సుమారు 800 మంది పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేస్తానని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం అధికారులతో పాత కొత్తగూడెంలోని డబుల్ బెడ్ రూమ్‌ల పక్కన ఉన్న 28 ఎకరాల స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒక్కొక్కరికి సుమారు రూ.8 లక్షలు విలువ చేసే 75 గజాల స్థలాన్ని ఇస్తామన్నారు. అధికారులు యుద్ధప్రాతిపాదికన లే అవుట్ చేసి మార్కింగ్ ఇవ్వాలని ఆదేశించారు. సోమవారం ఉదయం 9 గంటలకు కొత్తగూడెం క్లబ్‌కు రావాలని, వచ్చిన లబ్ధిదారులకు సౌకర్యాలు కలుగజేస్తామన్నారు. ఇంకా ఇళ్లు లేని పేదలుంటే వారికి కూడా త్వరలో స్థలాలను పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, కౌన్సిలర్లు సుజాత, పరమేష్‌యాదవ్, కోలాపురి ధర్మరాజు, నాయకులు రజాక్, విజయకుమార్, నాగరాజు, పురుషోత్తం, పుల్లయ్య, మున్సిపల్ కమిషనర్, రఘు, టీపీబీఓ ప్రభాకర్, డీఈ రవి, ఏఈ రాము, నాయకులు, కార్యకర్తలు అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ప్రతీ పల్లెకు వసతులు కల్పిస్తాం


సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లెందురూరల్: ప్రతీ పల్లెకు మౌళిక వసతులు కల్పించడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ అన్నారు. మండలంలోని ధనియాలపాడు, రేపల్లెవాడ, సీఎస్పీ బస్తీ పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండలంలోని ప్రతీ గ్రామంలోనూ చాలా వరకు అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశామన్నారు. లింకు రోడ్లను చాలా వరకు పూర్తి చేశామని, ఇంకా కొన్ని గ్రామాలలో రహదార్ల నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. ప్రతీ పంచాయతీకి పరిపాలన సౌలభ్యం కోసం గ్రామపంచాయతీ భవనాలు నిర్మించుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం పోలారం, చల్లసముద్రం గ్రామాల్లో గణేష్ మండపాల్లో ఎమ్మెల్యే హరిప్రియ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, వైస్‌ఎంపీపీ దాస్యం ప్రమోద్ కుమార్, పీఏసీఎస్ చైర్మన్ మెట్టెల కృష్ణ, సర్పంచ్‌లు తిరుపతి, అలెం కౌసల్య, చినబాబు, ఎంపీటీసీ పూనెం లింగమ్మ, బీఆర్‌ఎస్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక, నాయకులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట నిరసన


మాట్లాడుతున్న హరిలాల్

టేకులపల్లి: టీపీటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో కేజీబీవీ బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న నిరసనకు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ హరిలాల్ నాయక్ కోరారు. ఈ మేరకు శనివారం కేజీబీవీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు వ్యవస్థను రద్దు చేసి బోధన సిబ్బందిని రెగ్యులర్ ఉపాధ్యాయులుగా, బోధనేతర సిబ్బందిని రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసే వరకు కనీస వేతనం చెల్లించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేజీబీవీ సిబ్బంది శ్రమ దోపిడీ అరికట్టి, సమాన పనికి సమాన వేతనాన్ని చెల్లించి వారి డిమాండ్లను పరిష్కరించాలని, పరిష్కరించే వరకు వారి పక్షాన ఉండి పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో మండల ప్రధాన కార్యదర్శి ఎం.రమణ సిబ్బంది పాల్గొన్నారు.

అప్పులపాలైన 'భోజన' కార్మికులు


సూపర్‌బజార్(కొత్తగూడెం): సమ్మె శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు


ఇల్లెందురూరల్: సమ్మె నోటీసు అందజేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మధ్యాహ్న భోజన కార్మికులకు రావాల్సిన బకాయి వేతనాలు, బిల్లులు చెల్లించకుండా నెలల తరబడి జాప్యం చేస్తూ వారిని రాష్ట్ర ప్రభుత్వం అప్పులపాలు చేసిందని సీపీఐ జిల్లా సమితి సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు అన్నారు. భోజన కార్మికులు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె సందర్భంగా కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సత్తెనపల్లి విజయలక్ష్మి, అన్నవరపు వెంకటేశ్వర్లు, మంగ, రమావతి, ప్రభావతి, లక్ష్మి, రాధ, సరోజ, శ్రీదేవి, వెంకటలక్ష్మి, విజయ, కమలమ్మ, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఈ నెల 28 నుంచి మధ్యాహ్న భోజన వర్కర్లు నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నబి తెలిపారు. ఈ మేరకు శనివారం ఎంపీపీ చీమల నాగరత్నమ్మకు మధ్యాహ్నభోజన వర్కర్లు సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుల్తానా, కుమారి, సరిత, యాదమ్మ, రాములమ్మ, కనకమ్మ, విజయ, మీనా, పద్మ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామక పత్రాలు అందజేత


నియామక పత్రం అందజేస్తున్న జీఎం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో కొంతకాలం పనిచేసి మెడికల్ ఇన్‌వాలిడేషన్, అనారోగ్యకారణాలతో మృతిచెందిన కార్మికుల పిల్లలకు శనివారం కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సింగరేణిలో రద్దయిన వారసత్వ ఉద్యోగాలకు ముఖ్యమంత్రి కేసీఆర్ జీవం పోశారన్నారు. విధి నిర్వహణలో అధికారులు తెలిపిన రక్షణ సూత్రాలను పాటిస్తూ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం జీవీ కోటిరెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ కె.సుమలత, పర్సనల్ మేనేజర్ బి.శివకేశవరావు, సర్వే సదానందం, ఎన్విరాన్‌మెంట్ మేనేజర్ సత్యనారాయణ, పర్చేజ్ ఇన్‌చార్జ్ బి.మాధవ్, సీనియర్ పీఓ జి.సంఘమిత్ర, జూనియర్ అసిస్టెంట్ ఆర్ ఇంధావతి, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నిరాదరణ


ఇల్లెందు: మాట్లాడుతున్న ప్రతాప్


టేకులపల్లి: మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

ఇల్లెందు: చిన్నారులకు మొదటి గురువు అంగన్‌వాడీ టీచర్లేనని అలాంటి మొదటి గురువులకు ఈ ప్రభుత్వంలో నిరాదరణ తప్పడం లేదని బీఎస్పీ నియోజకవర్గ కన్వీనర్ బాదావత్ ప్రతాప్ తెలిపారు. శనివారం ఇల్లెందు తహసీల్ ఎదుట కొనసాగుతున్న అంగన్‌వాడీ టీచర్ల దీక్షలకు సంఘీభావం తెలిపారు. సంఘీబావం తెలిపిన వారిలో బీఎస్పీ నేతలు లేతాకుల కాంతారావు, రాయల శ్రీనివాసరావు, పప్పుల గోపీనాథ్, అజ్మీర వెంకన్న, రాంప్రసాద్, లోకేష్, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, మరియ, ఫాతిమా, మమత, వసంత, నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

టేకులపల్లి: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరికి వ్యతిరేకంగా టేకులపల్లి సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీలు మోకాళ్లపై నిరసన తెలియజేశారు. కొండపల్లి శకుంతల, వై.ఇందిర, గుగులోత్ రాంచందర్, అయిత శ్రీరాములు, వై.పద్మావతి, రాజేశ్వరి, భద్రమ్మ, సంధ్యారాణి, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ లెక్కలు తేల్చండి

ఇల్లెందు: కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ లెక్కలు తేల్చాలని, జాతీయ పండగలకు మస్టర్ ఇవ్వాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి ప్రగతిశీల కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్ షావలీ డిమాండ్ చేశారు. శనివారం ఇల్లెందు ఏరియా జేకే సింగరేణి సివిల్ డిపార్ట్‌మెంట్ మస్టర్ అడ్డా వద్ద జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ... చట్టబద్ధ హక్కులు కాంట్రాక్ట్ కార్మికులకు ఇవ్వడం లేదన్నారు. 2013 నుంచి హైపర్ కమిటీ వేతనాలు ఇవ్వాలని కోరారు. కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలని కోరారు. ఈ ధర్నాలో నాయకులు మేకల శ్రీను, చారీ, వెంకన్న, తరుణ్, జగదీష్, సుజాత, సైదా, రాజేశ్వరీ, మల్లిఖా, మాదవీ, ఫాతిమా, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): సోమవారం కొత్తగూడెం హెడ్డాఫీస్ ఎదుట నిర్వహించనున్న ధర్నాలో కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కార్పొరేట్ ఏరియా పరిధిలోని పలు ప్రాంతాల్లో ధర్నా కార్యక్రమంపై విస్తృత స్థాయిలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. గతేడాది కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 18 రోజులు వేతనాలు నష్టపోయి సమ్మెబాట పట్టిన క్రమంలో చర్చలకు పిలిచి పలు ఒప్పందాలు చేసిన యాజమాన్యం వాటి అమలును విస్మరించిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

అధికారులు న్యాయం చేయాలి

టేకులపల్లి: అన్ని అర్హతలున్నా తమని గృహలక్ష్మి పథకానికి ఎంపిక చేయలేదని మండలంలోని రాంపురానికి చెందిన తేజావత్ కోటేశ్వర్‌రావు అన్నాడు. ఈ మేరకు శనివారం మండలకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో తన కుటుంబ సభ్యులతో కలిసి ఆయన మాట్లాడుతూ... గృహలక్ష్మి పథకానికి తన అమ్మ తార్కి, భార్య మేరి పేర్లతో దరఖాస్తు చేసుకోగా అధికారుల బృందం తనిఖీలో తమను అర్హులుగా ధృవీకరించారన్నారు. కానీ పంచాయతీ కార్యదర్శి వ్యక్తిగత కక్షతో ఇళ్లు మంజూరు చేయాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడని, డబ్బులు ఇవ్వకపోవడంతో రెండు పేర్లు తొలగించాడని ఆరోపించారు. ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై రాంపురం కార్యదర్శి సందీప్ వివరణ కోరగా నిబంధనల ప్రకారమే తార్కి, మేరీల దరఖాస్తులు తిరస్కరించామని, వారికి స్లాబ్ ఇల్లు ఉన్న కారణంగా వారు అనర్హులయ్యారన్నారు. వారిని డబ్బులు అడిగాననడం అవాస్తవమని, ఇల్లు మంజూరు చేయలేదనే తనపై అసత్య ప్రచారం చేస్తున్నారన్నారు.

శిక్షణ పొందిన మహిళలకు రాత పరీక్ష


అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్‌తో వృత్తి విద్య శిక్షణ పొందిన మహిళలు

ఇల్లెందు: సింగరేణి సేవా సమితీ ఆధ్వర్యంలో వృత్తి విద్య శిక్షణ పొందిన మహిళలకు శనివారం సింగరేణి హైస్కూల్‌లో రాత పరీక్ష నిర్వహించారు. అనంతరం సేవా సమితి అధ్యక్షురాలు నిమ్మి ఆనంద్ పరీక్ష కేంద్రంను తనిఖీ చేసి శిక్షణ పొందిన తీరును గమనించారు. మహిళలు ఉచిత స్వయం ఉపాధి శిక్షణ పొందిన మహిళలు, వారి కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలన్నారు. స్వయం ఉపాధితో పాటు మరికొంత మందికి ఉపాధి మార్గం కల్పించిన వారు అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ కె. సాయి స్వరూప్, సాంబయ్య, విజయ, సులక్షణ, విజయలక్ష్మీ, వాణీ, సంధ్యారాణి, ఉమా చండీ, ఆశ, సుప్రియ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ మండపాల్లో పూజలు, అన్నదానాలు

గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం పూజలు నిర్వహించారు. గణపతిని ప్రత్యేకంగా అలంకరించి కుంకుమార్చన, అభిషేకాలు చేశారు. పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. – సాక్షి నెట్‌వర్క్


టేకులపల్లి: సామూహిక కుంకుమ పూజలో మహిళలు


పాల్వంచ: వర్తక సంఘం వద్ద పండ్ల అలంకరణలో గణనాథుడు


ఇల్లెందు: అన్నదానం ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య


పూజల్లో పాల్గొన్న డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు


అన్నదానంలో భక్తులు


సింగరేణి కొత్తగూడెం: అన్నదానం కార్యక్రమానికి హాజరైన ఏజీఎం సివిల్ రామకృష్ణ, తదితరులు


కొత్తగూడెంటౌన్: న్యూగొల్లగూడెంలో..